
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
మంగళవారం 15 జూలై 2025



ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు
'నవోదయ'కు 29 వరకు అవకాశం 7

పథకం ప్రకారమే తాజొద్దీన్ హత్య
బానామతి చేస్తున్నాడనే అనుమానంతో.. 6
హత్యకేసులో ముగ్గురు నిందితులకు రిమాండ్

ఓపీక పడితేనే వైద్యం

- సంగారెడ్డి జీజీహెచ్‌కు పోటెత్తిన రోగులు
- వాతావరణ మార్పులతో వ్యాధుల వ్యాప్తి



సంగారెడ్డి ఎంసీహెచ్‌లో ఓపీ రిజిస్ట్రేషన్ కోసం బారులు తీరిన గర్భిణులు



సంగారెడ్డి జీజీహెచ్‌లో ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద వద్ద రోగుల రద్దీ

సంగారెడ్డి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. అడపాదడపా కురుస్తున్న చెదురుముదురు వర్షాలకు తోడు తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలు, పారిశుధ్య లోపం కారణంగా సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. ప్రధానంగా తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, జలుబు, గొంతు నొప్పి, వాంతులు, విరేచనలు వంటి లక్షణాలతో రోగులు బాధపడుతూ ఆస్పత్రుల పాలవుతున్నారు. దీంతో సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రం రోగులతో కిటకిటలాడింది. ఆభా ఓపీ రిజిస్ట్రేషన్‌తో పాటు ఓపీ వైద్యుల గదుల వద్ద రోగులు బారులు తీరి కనిపించారు. సోమవారం ఒక్క రోజే రోగుల తాకిడితో 1,874 ఓపీ నమోదైందని ఆస్పత్రి అధికారులు తెలిపారు.



డెంగ్యూ డేంజర్

వర్షాకాలంలో విజృంభణకు అవకాశం
అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
పరిసరాల పరిశుభ్రతతోనే చెక్
లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి
7



వట్‌పల్లిలో రోడ్డు విస్తరణ కోసం కూల్చేసిన దుకాణాలు

ఇదే చోద్యం!

రహదారి విస్తరణ కోసం ఒకవైపే నిర్మాణాల కూల్చివేత
వట్‌పల్లి రోడ్డు విస్తరణలో అధికారుల ఇష్టారాజ్యం
కొందరికి లాభం చేసేలా మార్కింగ్
ఒకవైపే దుకాణాల తొలగింపు
పోలీసుల పహారాలో కూల్చివేతలు

వట్‌పల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వట్‌పల్లి మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వివాదాలకు దారితీశాయి. అధికారులు, పోలీసుల సాక్షిగా కొందరికి లాభం చేసేలా అధికారులు పావులు కదిపారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరికి లాభం చేకూరేలా మార్కింగ్ చేసిన అధికారులు, ఇతరుల దుకాణాల కూల్చివేతకు పూనుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో అధికారుల తీరుకు నిరసనగా ఈ నెల 10న బాధితులు రాస్తారోకో చేయడంతో అధికారులు తాత్కాలికంగా వెనక్కి తగ్గారు. ఎవరికీ లాభం చేయడం తమ ఉద్దేశం కాదని, దుకాణాలూ తొలగిస్తామని బాధితులకు నమ్మబలికారు. కానీ, చివరకు అందుకు వ్యతిరేకంగా చేశారు. సోమవారం సీఐ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసుల పహారాలో దుకాణాలను కూల్చివేయించారు. అక్కడే ఉన్న సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు జోక్యం చేసుకోకుండా చోద్యం చూశారు. దీనిపై మండిపడ్డ దుకాణాల యజమానులు కూల్చివేతలతో పోలీసులకు ఏం పని అని నిలదీశారు. సంబంధంలేని విషయంలో ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని ఆందోళన చేశారు. దీంతో, డిప్యూటీ ఈఈ రవీందర్ కలుగజేసుకుని నోటీసుల ప్రకారం అరవై అడుగులకే మార్కింగ్ వేశామని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని తెలిపారు. నిబంధనల ప్రకారం తొలుత 55 అడుగుల లోపల ఉన్న దుకణాలను తొలగిస్తామని చెప్పారు. అనంతరం 60 అడుగుల వరకు ఉన్న అన్ని దుకాణాలను తొలగించారు. ఈ వ్యవహారం మొత్తం కొందరు నాయకుల కనుసన్నల్లోనే జరుగుతోందని, అధికారులు స్వతంత్రంగా వ్యవహరించడ లేదని బాధితులు ఆరోపించారు. తమకు కావాల్సినవారి దుకాణాలను రక్షించడానికే మార్కింగ్‌ను మార్చి కూల్చివేతలు చేపడుతున్నారని మండిపడ్డారు.

పదవులకు బ్రేక్

స్థానిక ఎన్నికల తర్వాతేనన్న కాంగ్రెస్ పెద్దలు

కాంగ్రెస్‌లో సంస్థాగత పదవుల పంపకానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. పట్టణ, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తులు చేసినవారందరికీ నిరాశ ఎదురైంది. ఎటుదిరిగీ ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తారని కొద్దిరోజులుగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం రోజున గాంధీభవన్‌లో ఇంటర్వ్యూలు జరుగుతాయని సమాచారం వచ్చింది. ఉమ్మడి మెదక్ జిల్లా పీసీసీ ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా ఆశావహులతో ముఖాముఖి మాట్లాడతారని సంకేతాలు వచ్చాయి. దీంతో దరఖాస్తు చేసినవారంతా గాంధీభవన్‌లో ప్రత్యక్షమయ్యారు. ఇంటర్వ్యూలో మంచి మార్కులతో పదవులు సొంతం చేసుకోవాలని భావించారు. కానీ, అక్కడికి వెళ్లాక సీన్ అంతా రివర్సయ్యింది. స్థానిక ఎన్నికలు పూర్తయిన తర్వాతనే పదవుల పంపకం ఉంటుందని తేల్చి చెప్పారు. ఎన్నికలపై నియోజకవర్గాలవారీగా ఇన్‌చార్జిలతో పాటు ఆశావహులకు మంత్రి పొన్నం దిశానిర్దేశం చేశారు.

అప్పటి వరకు పాతవారినే కొనసాగించాలని నిర్ణయం
పెండింగ్‌లోనే మండల, పట్టణ, బ్లాక్ అధ్యక్షుల ఎంపిక
పదవులపై ఆశతో గాంధీభవన్‌కు తరలివెళ్లిన ఉమ్మడి జిల్లా నేతలు
ఇంటర్వ్యూలు లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగిన ఆశావహులు

'స్థానికం'పై కాంగ్రెస్ జెండా ఎగరాలి | 7లో

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 14: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన పదవులు అందినట్లే అంది మళ్లీ దూరమయ్యాయని కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక నేతలు ఆవేదన చెందుతున్నారు. మండల, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక పూర్తయితే అనుబంధ కార్యవర్గాలు, గ్రామ, వార్డు శాఖల అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ సైతం పూర్తయ్యేది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు పూర్తవుతున్నా పార్టీ పదవుల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వలేదనే నిరుత్సాహంలో ఉన్నారు. ఇటీవల ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించినప్పటికీ, స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో నిర్వహించాలని నిర్ణయించడంతో మరోసారి వాయిదాపడింది.

ఎన్నికల్లో విభేధాలు రావొద్దని

ఇప్పటికే ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలతో పార్టీ నేతలు రోడ్డెక్కారు. పార్టీ పదవుల కోసం కూడా గ్రూపులవారీగానే దరఖాస్తులు సమర్పించారు. ఆయా మండలాలు, బ్లాకులు, పట్టణాల అధ్యక్షుల పదవులు తమ వర్గానికే రావాలంటూ ఎవరికివారే ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం గాంధీ భవన్‌లో పదవుల ఎంపిక జరుగుతుందని తెలియడంతో తమవంతు ప్రయత్నాలు చేసుకున్నారు. కానీ, అధిష్ఠానం సూచనలతో పదవుల ప్రక్రియ వాయిదాపడింది. అయితే స్థానిక, పంచాయతీ ఎన్నికల్లో విభేధాలు రాకుండా ఉండేందుకే పదవులను వాయిదా వేసినట్లుగా తెలుస్తోంది. పదవులు రానివారు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసే అవకాశం ఉంటుందని భావించారు. పార్టీ సమావేశాల్లోనూ నిరాశతో అసమ్మతి సెగలు రగలించే పరిస్థితి దాపురిస్తుందని గుర్తించారు. ఈ ప్రభావం వల్ల ఎన్నికల్లో ప్రతికూల

మిగతా 7వ పేజీలో



గాంధీభవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నేతలతో సమావేశమైన పీసీసీ ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్



సర్కారు బడుల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం

50కి పైగా విద్యార్థులున్న పాఠశాలలకు అవకాశం

సంగారెడ్డి జిల్లాలో 378 స్కూళ్లలో ఏర్పాట్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో సాంకేతిక బోధనకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని 378 ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. 50 మందికి పైగా ఉన్న విద్యార్థులున్న ప్రభుత్వ పాఠశాలలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించారు. ఈ మేరకు అవసరమైన చర్యలు విద్యాశాఖ అధికారులు చేపట్టారు.

సాంకేతికత వైపు అడుగులు

విద్యార్థులను సాంకేతికత వైపు రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) ద్వారా బోధనకు పరిచయం చేసింది. ఇప్పటికే జిల్లాలోని సుమారు 200కు పైగా పాఠశాలలకు రెండు నుంచి ఐదు కంప్యూటర్ల వరకు సరఫరా చేశారు. ఇంకా దశలవారీగా కంప్యూటర్లనూ సరఫరా చేస్తూనే ఉన్నారు. వీటికి బీఎస్ఎన్ఎల్ వారితో ఉచిత ఇంటర్‌నెట్ సదుపాయం కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే సంగారెడ్డి జిల్లాలో 33 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన ప్రారంభించారు. అదే బాటలో విద్యార్థులు సాంకేతిక వైపు అడుగులు వేసి తమ నైపుణ్యాలు పెంపొందించుకోవడంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకునేందుకు సర్కారు తీసుకున్న నిర్ణయం ఎంతో దోహదపడనున్నది.

పాత పుస్తకాలే దిక్కు

కస్తూర్బా విద్యాలయాలకు చేరని ఇంటర్ పుస్తకాలు
ఇప్పటికే ప్రారంభమైన తరగతులు
ముందుకు సాగని బోధన.. అయోమయంలో విద్యార్థులు
మెదక్ జిల్లాలో 9, సంగారెడ్డి జిల్లాలో 17 కేజీబీవీలు



వెల్దుర్తిలో కేజీబీవీలో పాత పుస్తకాలతోనే చదువుకుంటున్న విద్యార్థినులు

మెదక్ అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే అందాల్సిన పాఠ్య పుస్తకాలు నేటికీ అందలేదు. తరగతులు ప్రారంభమై నెల గడుస్తున్నా పాత పుస్తకాలతో నెట్టుకొస్తున్నారు. మెదక్ జిల్లావ్యాప్తంగా తొమ్మిది కేజీబీవీ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం 768 మంది విద్యార్థినులు విద్యభ్యసిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 17 కళాశాలల్లో

కొనసాగుతున్న తరగతులు

విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభమైంది. నేటికి విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు అందలేదు. దాంతో విద్యాభ్యాసంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆధ్యాపకులు ఏ పాఠం బోధిస్తున్నారో.. తాము ఏం చదవాలో.. ఏం రాయాలో.. అర్థంగాక విద్యార్థినులు అయోమయానికి గురువుతున్నారు. మరోవైపు ఇంకా ప్రవేశాలు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థినులు నష్టపోకుండా పాత పుస్తకాలతోనే పాఠాలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు అందినట్లు తెలుస్తున్నది.

పాత పుస్తకాల సర్దుబాటు

కేజీబీవీల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆయా కోర్సుల్లో చేరిన విద్యార్థినులకు ఉచిత పాఠ్య పుస్తకాలు ఇప్పటి వరకు అందలేదు. దీంతో, అధ్యాపకులు పాత పుస్తకాలను సర్దుబాటు చేస్తున్నారు. అయితే, అందరికీ సరిపోకపోవడంతో ఇబ్బందులు

మిగతా 8వ పేజీలో



చిలప్‌చెడ్‌లో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

జిల్లాలో సమృద్ధిగా యూరియా, ఎరువులు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలప్‌చెడ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో 4,500 మెట్రిక్ టన్నుల యూరియా, సమృద్ధిగా కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. చిలప్‌చెడ్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని సోమవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. దుకాణంలో స్టాక్ వివరాలను, ధరల పట్టికను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇండెంట్ ఆధారంగా అవసరానికి తగ్గట్టుగా ప్రభుత్వం ఎరువులు పురుగు మందులు సరఫరా చేస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎరువులు పురుగులు మందులు కొరత లేదన్నారు. యూరియా ఇతర ఎరువులు అందుబాటులో ఉంచామన్నారు. సాగుకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన పక్షంలో సమస్యను పరిష్కరిస్తూ కొత్త సమస్యలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టామన్నారు. వానాకాలంలో పంటలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రైతులందరికి రైతుభరోసా నిధులు జమ చేయడం జరిగిందని తెలిపారు.

సర్టిఫికెట్‌కో రేటు!

అక్రమాలకు నిలయాలుగా మీసేవా కేంద్రాలు

పేరు ఒకరిది.. నిర్వహించేది మరొకరు ● మార్కెట్‌లో నకిలీ సర్టిఫికెట్లు



సంగారెడ్డిలోని మీసేవా కేంద్రం

సంగారెడ్డి క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మీ సేవా కేంద్రాలు అక్రమాలకు నిలయాలుగా మారాయి. ఒక్కో సర్టిఫికెట్‌కు ఒక్కో రేటు వెలకట్టి వసూలు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 174 మీ సేవా కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల ద్వారా 38 ప్రభుత్వ శాఖలకు సంబంధించి మొత్తం 242 పౌర సేవలను ప్రజలకు అందజేస్తున్నారు. చాలా కేంద్రాల్లో ఆధార్ కార్డులో మార్పులు, జనన, మరణ ధృవపత్రాలు, కుల, ఆదాయ ధృవపత్రాలు ఇలా ఎటువంటి ధృవపత్రానికైనా ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత ధర కంటే ఎక్కువ వసూలు చేస్తున్నారు. మరికొందరు నకిలీ ధ్రువపత్రాలు సైతం విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్టిఫికెట్ త్వరగా కావాలంటే అడిగినంత చెల్లించాల్సిందే.మీ సేవా కేంద్రాల నిర్వాహకులు వినియోగదారుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ చెల్లిస్తేనే ఏ సర్టిఫికెట్ అయినా సకాలంలో చేతికందుతోంది.

బినామీల నిర్వహణ

ప్రభుత్వం తరఫున పౌరసేవలను పారదర్శకంగా అందించడం, అదే సమయంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసం ప్రభుత్వం మీ సేవా కేంద్రాలను కేటాయిస్తున్నది. కానీ, చాలాచోట్ల ఒకరి పేరుపై మంజూరైతే మరొకరు నిర్వహిస్తున్నారు. బినామీలు ప్రజల నుంచి అధిక వసూళ్లకు పాల్పడుతున్నారు. డబ్బులు ఇస్తే ఎలాంటి పత్రాలు జత చేయాల్సిన అవసరం లేకుండానే ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక కేవలం అలంకార ప్రాయంగానే మిగిలిపోతున్నది.

ఇప్పుడు సంగారెడ్డి.. అప్పుడు బొల్లారం

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నకిలీ ధ్రువపత్రాల జారీ చేస్తున్నట్లు గుర్తించి ఓ మీసేవా కేంద్రాన్ని సోమవారం అధికారులు సీజ్ చేశారు. అలాగే, గత నెల ఐడీఏ బొల్లారంలోనూ మీ సేవా కేంద్రాలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువపత్రాలు విక్రయిస్తున్న విషయం వెలుగుచూసింది. అధికారుల దాడుల్లో ఫోర్జరీ సంతకాలతో కూడా ఎనిమిది ధ్రువపత్రాలను గుర్తించారు. బీహార్, ఒరిస్సా, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారికి నకిలీ ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువపత్రాలు విక్రయించినట్లు అధికారుల విచారణలో

మిగతా 8వ పేజీలో

సంగారెడ్డిలో మీ సేవా కేంద్రం సీజ్

నకిలీ ధ్రువపత్రాలు జారీ చేస్తున్నారనే ఫిర్యాదు ఆధారంగా సంగారెడ్డి పట్టణ పరిధిలోని నాల్సాబ్ గడ్డ ప్రాంతంలో ఉన్న మీ సేవా కేంద్రంపై పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. నకిలీ బర్త్‌సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని గుర్తించి ఈ కేంద్రాన్ని సీజ్ చేశారు. తహసీల్దార్ జయరామ్, పట్టణ సీఐ రమేష్ మాట్లాడుతూ మీ సేవా కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సంగారెడ్డిలో మీ సేవా కేంద్రాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

కార్డన్ సెర్చ్‌లో 60 బైక్‌లు స్వాధీనం

అల్లాదుర్గం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహించడం జరుగుతుందని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. సోమవారం అల్లాదుర్గం మండల పరిధిలోని ముస్లాపూర్‌లో కార్డన్ సెర్చ్ నిర్వహించి సరైన ధృవపత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలు, 2 బొలేరో వాహనాలు, 4 ఆటోలను సీజ్ చేసినట్లు ఆయన వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన ధృవపత్రాలు, ఇన్సూరెన్స్, లైసెన్సు తదితర ధృవపత్రాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం సీఐ రేణుకరెడ్డి, ఎస్సై శంకర్, పరిసర ప్రాంతాల ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




సీజ్ చేసిన బైక్‌లు













ప్రజావాణి సమస్యలపై సత్వరమే స్పందించాలి

- దరఖాస్తుల పరిష్కారం వేగవంతం కావాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి రూరల్/మునిపల్లి/సంగారెడ్డి క్రైం/ మెదక్ అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలపై దరఖాస్తులు స్వీకరించేందుకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. ప్రజావాణిలో వచ్చే సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడారు.



ఎస్‌హెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



దరఖాస్తుదారుల సమస్యను అడిగి తెలుసుకుంటున్న మెదక్ జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్



సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

పథకం ప్రకారమే తాజోద్దీన్ హత్య

- బాణామతి చేస్తున్నాడనే అనుమానంతో..
- హత్యకేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్

జహీరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిజిల్లా జహీరాబాద్ పట్టణంలో సంచలనం సృష్టించిన తాజోద్దీన్(26) హత్యకేసును పోలీసులు సోమవారం చేధించారు. ఇందుకు సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ సైదానాయక్ వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన తాజోద్దీన్(26), నిందితుడు మహ్మద్ హసన్‌కురేషీలు మానిక్‌ప్రభు మహేలాలోనే కొద్ది కొద్ది దూరంలో నివాసం ఉంటున్నారు. నిందితుడు నివాసం ఉండే ప్రాంతానికి తాజోద్దీన్ తరుచూ వచ్చి పోయే వాడన్నారు. ఈ క్రమంలో బాణామతి చేస్తున్నాడనే అనుమానం వచ్చి నిందితుడు హసన్‌ఖురేషీ పలుమార్లు మృతుడు తాజోద్దీన్‌ను మందలించాడన్నారు. మార్పు రాకపోవడంతో కక్ష పెంచుకున్న నిందితుడు హసన్‌ఖురేషీ, తాజోద్దీన్‌ను హత్యచేయాలని గతకొంత కాలంగా పథకాన్ని వేసుకున్నాడు. అందులో భాగంగానే ఈనెల 13న తాజోద్దీన్ నాగులకట్టవద్ద గల జామామజీద్‌లో నమాజ్‌చేసేందుకు వెళ్తున్నాడు. ఇంతలోనే హసన్‌ఖురేషీ మాణిక్‌ప్రభుమహేలాలో నివాసముంటున్న తోటి స్నేహితుడు షేక్‌ముక్రంకు తన ఇంటికి త్వరగా రావాలని చెప్పాడన్నారు. ఈ క్రమంలోనే షేక్ ముక్రం హసన్‌ఖురేషీ ఇంటి వద్దకు ద్విచక్రవాహనంపై వచ్చాడు. ఇంతలోనే వారిద్దరుకలిసి జామమజీదుకు వెళ్తున్న తాజోద్దీన్ వద్దకు చేరుకుని ద్విచక్రవాహనంపై పట్టణంలోని చెన్నారెడ్డినగర్ వద్ద ఓ చెరుకుతోటలోకి తీసుకువెళ్లారన్నారు. అక్కడ హసన్‌ఖురేషీ, షేక్‌ముక్రంలు కలిసి చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేసి చిత్రహింసలకు గురిచేశారు.

ఆనంతరం హసన్‌ఖురేషీ హత్యచేసేందుకు తీసుకువచ్చిన వేటకొడవలి(కమ్మకత్తితో) మెడపై దాడిచేయగా తాజోద్దీన్ బలమైన గాయాలకు గురై అక్కడిక్కడే మృతిచెందాడన్నారు. ఆనంతరం మృతిచెందిన తాజోద్దీన్ మృతదేహాన్ని టీఎస్15-ఎఫ్‌హెచ్7353 నెంబరుగల కారులో హసన్‌ఖురేషీ, షేక్ ముక్రం, అక్బర్‌లు కలిసి సిద్దేశ్వరఆలయం సమీపంలోని పాడుబడిన పడవేశారన్నారు. అదేరోజు రాత్రి నిందితులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన చెప్పారు. హత్యకు ఉపయోగించిన కారు, మూడు ద్విచక్రవాహనాలు, వేటకొడవలి, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనంచేసుకుని కోర్టులో హాజరు పరుచడమైందన్నారు. హత్యలు, వేదింపులు, మట్కా, తదితర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారినైన వదులబోమని, కఠినచర్యలు తీసుకుంటామని డీఎస్పీ సైదానాయక్, సీఐ. శివలింగం, ఎస్సై వినయ్‌కుమార్‌లు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన చెరువు వివాదం

- 30 ఏళ్ల నిరీక్షణకు తెర
- 33 మంది మత్స్యకారులకు పెద్ద చెరువులో సభ్యత్వం

జోగిపేట రూరల్ , జూలై14 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఇరు గ్రామాల చెరువు వివాదం ముగిసింది. 33 మంది మత్స్యకారుల సభ్యత్వంతో 30 ఏళ్ల నిరీక్షణకు తెర పడింది. కన్సన్‌పల్లి- పేద్దాపూర్ గ్రామాల సరిహద్దులో విస్తరించి ఉన్న పెద్ద చెరువులో కన్సన్‌పల్లి గ్రామంలోని మత్స్యకారులు సభ్యత్వం కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం కన్సన్‌పల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుల సంఘానికి చెందిన 33 మంది సభ్యులకు పెద్దాపూర్ చెరువులో చేపలు పట్టేందుకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు రెండు రోజుల క్రితం కన్సన్‌పల్లి మత్స్య సహకార సంఘానికి, జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు నర్సింలు ఉత్తర్వు కాపీని అందజేశారు. దీంతో గ్రామంలో మత్స్యకారుల కుటుంబాల్లో ఆనందాలు వ్యక్తమౌతున్నాయి. దీంతో మత్స్యకారులు కన్సన్‌పలి గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు.



పెద్ద చెరువులో సభ్యత్వం పొందిన మత్స్యకారులు

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ యువనేత దుర్మరణం



కొల్చారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ కాంగ్రెస్ నేత దుర్మరణం చెందారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని పైతర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మారెల్లి అనిల్‌కుమార్(35) సోమవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరిగిన సమావేశానికి వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఆయన ప్రయాణిస్తున్న కారు మండలంలోని వరిగుంతం శివారు ప్రాంతంలో అదుపు తప్పి.. డివైడర్‌ను ఢీ కొట్టింది. మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ ఆయన చనిపోయారు.

తండ్రి దాడిలో 11 నెలల చిన్నారి మృతి

శివ్వంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యను కొడుతుండగా, ఆ దాడిలో 11 నెలల బిడ్డకూ దెబ్బ తగిలి చిన్నారి చనిపోయింది. ఈ ఘటన సోమవారం మెదక్ జిల్లా శివ్వంపేటలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కుంట మహేష్ దినసరి కూలి. కల్లుకు బానిస అయ్యాడు. నిత్యం కల్లు తాగి వచ్చి భార్యను కొట్టేవాడు. ఈ నెల 5న కూడా కల్లు తాగి మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం పెట్టమని భార్యను అడిగగా బిడ్డ ఏడుస్తున్నందున నువ్వే పెట్టుకుని తినమని చెప్పింది. భోజనం పెట్టడం లేదన్న ఆగ్రహంతో మహేష్ భార్యను తీవ్రంగా కొట్టాడు. ఈ క్రమంలో ఆమె ఒడిలో ఉన్న బిడ్డకు దెబ్బ తగిలి స్పృహ కోల్పోయిన చిన్నారిని వెంటనే స్థానికంగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ సోమవారం చిన్నారి మృతి చెందింది. అయితే, చిన్నారి తల్లి మాత్రం ఇద్దరి మధ్య గొడవ జరగగా, ఆ గొడవలో తన భర్త చేతుల్లో నుంచి బిడ్డ జారిపడి స్పృహ కోల్పోయిందని, ఆస్పత్రికి తరలించగా చనిపోయిందని తమకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

టిప్పర్‌ను ఢీ కొని వ్యక్తి..

జిన్నారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిలిపి ఉంచిన టిప్పర్‌ను ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సోమవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో జిన్నారం మండలం దాదిగూడెం గ్రామ శివారులో ప్రధాన రహదారి పై బ్రేక్‌డౌన్ అయిన టిప్పర్‌ను రోడ్డు పక్కన నిలిపి ఉంచగా, అటుగా బైక్‌పై వస్తున్న సుదర్శన్(40) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు టిప్పర్‌ను ఢీ కొట్టి అక్కడికక్కడే మరణించాడు. మృతుడు సుదర్శన్ గుమ్మడిదల మండలం మంభాపూర్ గ్రామానికి చెందిన వాడు. సుదర్శన్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. స్థానికుల సమాచారంతో జిన్నారం పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

మెదక్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం వార్డు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చేపట్టిన నిర్మాణాలు గణనీయంగా ముందుకు సాగుతున్నప్పటికీ, కొన్నిచోట్ల అనుమతులు, హద్దులకు సంబంధించిన సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. లబ్ధిదారులు నిర్మాణ పనుల వేగం పెంచాలని, నాణ్యతపై రాజీ లేకండా చూడాలని వార్డు అధికారులకు సూచించారు. నిర్మాణాలకు అవసరమైన నిధులు విడతల వారీగా విడుదల చేస్తామని అన్నారు. నిర్మాణాలలో ఎక్కడ అడ్డంకులు ఉన్నా వెంటనే తొలగించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో 400 ఇళ్లకు మంజూరీ వచ్చిందని, అందులో 287 ఇళ్లకు అనుమతులు వచ్చాయని వివరించారు. మిగతా ఇళ్లకు త్వరలోనే అనుమతులు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఇక 98 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. ఈ సమావేశంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై అట్రాసిటీ కేసు..

శివ్వంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భూ వివాదం ఘర్షణలో దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేసిన ఘటన సోమవారం దొంతి గ్రామంలో జరిగింది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని దొంతి గ్రామానికి చెందిన జంగం స్వామికి సంబంధించిన భూమిని అదే గ్రామానికి చెందిన భావన గారి శ్రీనివాస్ కబ్జా చేసి, పొలంలో నాటు వేసారని బాధితుడు స్వామి ఆరోపించారు. శ్రీనివాస్‌ని నా పొలంలో నాటు ఎందుకు వేశావని ప్రశ్నించగా జంగం స్వామిని కులం పేరుతో దూషించి, కట్టెలతో దాడి చేయడంతో తీవ్ర గాయాలయి రక్త స్రావణం అయింది. బాధితుడు జంగం స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భావనగారి శ్రీనివాస్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

తాళం పగలగొట్టి చోరీ

చేగుంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు తాళం పగలగొట్టి బంగారం, నగదు చోరీ చేశారు. ఈ సంఘటన సోమవారం నార్సింగ్ మండల కేంద్రంలో జరిగింది. నార్సింగ్ ఎస్సై అహ్మద్ మైనుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోండ్ల శ్రీనివాస్ ఆర్టీసీ ఉద్యోగి. ఇంటికి తాళం వేసి పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉందని గుర్తుతెలియని దుండగులు తాళం పగలగొట్టి బీరువాలోని బంగారం, కొంత నగదును దొంగలించారని చెప్పాడు. విషయం తెలుసుకున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ రంగాకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని క్లూ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

కేజీబీవీలో బాలిక అదృశ్యం

చేగుంట జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీలో ఇంటర్ బాలిక అదృశ్యమైంది. మతి స్థిమతం లేని తల్లి కలిగిన ఓ ఇంటర్ బాలికను బంధువులు చేరదీసి కేజీబీవీలో చేర్పించారు. చేర్పించిన 5 రోజులకు బంధువులంటూ ఓ వ్యక్తి వచ్చి బాలికను తీసుకెళ్లాడు. వారం రోజులు గడిచినా బాలిక కేజీవీబీ విద్యాలయానికి రాకపోవడంతో మిస్టరీగా మారిపోయింది. ఈ ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం రెడ్డిపల్లిలోని కస్తూర్బా గాంధీబాలికల విద్యాలయంలో జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనపై విద్యాలయ ప్రత్యేక అధికారి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు అదనపు కలెక్టర్ నగేష్ వివరించారు. వివరాలు ఇలా ఉన్నాయి నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం హంగర్గ గ్రామానికి చెందిన(16)సంవత్సరాల బాలిక తల్లి మతి స్థిమతం లేక బంధువులు చేరదీశారు. ఈనెల 2న చేగుంట మండలం రెడ్డిపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మేనమామ, పెద్దమ్మలు బాలికను చేర్పించారు. చేర్పించిన 5 రోజులకే మేనమామనంటూ గుర్తుతెలియని ఓ వ్యక్తి ఈనెల 7న బాలికను విద్యాలయం నుంచి తీసుకెళ్లాడు. రెండు రోజులైనా బాలిక విద్యాలయానికి రాకపోవడంతో బుధవారం ఈ విషయమై పాఠశాల ప్రత్యేక అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా అదన కలెక్టర్ నగేష్, జిల్లా విద్యాధికారి రాధా కిషన్, కేజీవీబీ విద్యాలయాన్ని సందర్శించి బాలిక అదృశ్యంపై సిబ్బందితో చర్చించారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

బస్సు కోసం విద్యార్థుల రాస్తారోకో

దోమడుగులో మెదక్ - హైదరాబాద్ రహదారిపై ధర్నా



దోమడుగులో రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

గుమ్మడిదల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో విద్యార్థులు సోమవారం రాస్తారోకో నిర్వహించి తమ రవాణా సమస్యలపై ఆవేదన వ్యక్తం చేశారు. సరైన బస్సులు లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు దోమడుగు గ్రామ శివారులోని మెదక్ - హైదరాబాద్ రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. కొత్తగా చేరిన విద్యార్థులు ఎక్కువైనప్పటికీ, ప్రభుత్వం తగిన బస్సులు నడిపించకపోవడం, ఉన్న బస్సులు పూర్తిస్థాయిలో సేవలు అందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్నిసార్లు డ్రైవర్లు బస్సులను ఆపకుండానే వెళ్లిపోతున్నారని ఆరోపించారు. ఈ సమస్యపై పలుమార్లు విజ్ఞప్తులు చేసినా అధికారులు స్పందించకపోవడంతోనే రాస్తారోకో చేయాల్సి వచ్చిందని విద్యార్థులు పేర్కొన్నారు. రాస్తారోకో కారణంగా ట్రాఫిక్ స్తంభించగా, పోలీసులు అక్కడికి చేరుకొని విద్యార్థులతో చర్చలు జరిపారు. అదనపు బస్సులు నడపాలని, ప్రతి గ్రామంలో బస్సు ఆగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. జీడిమెట్ల డిపో మేనేజర్‌ను సంప్రదించి, బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

సిద్దిపేట డిగ్రీ కళాశాలలో 'వేముగంటికి' నివాళి

సిద్దిపేట కల్చరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం వేముగంటి నరసింహాచార్యుల జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేముగంటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగుశాఖ అధ్యక్షుడు సంపత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, వేముగంటి తొలితరం తెలంగాణ కవిపండితులు అని, బహుముఖ ప్రజ్ఞతో ప్రాంతీయ చైతన్యం, జాతీయ భావన, ప్రాపంచిక దృక్పథంతో రచనలు చేశారని గుర్తుచేశారు. తెలుగు అధ్యాపకులు పిట్లదాసు మాట్లాడుతూ వేముగంటి నరసింహాచార్యుల రచనలు పాఠశాల నుంచి పీజీ దాకా పాఠ్యాంశాలుగా ఉన్నాయని, వాటి సార్థకతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ల్యాబ్‌లతో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

● మెదక్ జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి



శివ్వంపేటలో శిక్షణలో మాట్లాడుతున్న మెదక్ సైన్స్ అధికారి రాజిరెడ్డి

శివ్వంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు మళ్లించడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు దోహదపడతాయని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి అన్నారు. సోమవారం శివ్వంపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ఇటీవల 25 పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందని, ప్రతి పాఠశాలకు రూ.10 లక్షల విలువైన రోబోటిక్స్‌తో పాటు అధునాతన ప్రయోగ పరికరాలను అందజేసిందని తెలిపారు. ఈ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించవచ్చని వివరించారు. మండల విద్యాధికారి బుచ్చనాయక్ మాట్లాడుతూ, జిల్లాలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఈ కేంద్రంలో 12 పాఠశాలలకు చెందిన 36 మంది ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, కోర్స్ కోఆర్డినేటర్ బాలచంద్రం, రిసోర్స్‌పర్సన్‌లు పాల్గొన్నారు.

గీత కార్మికులకు పరిహారం ఇవ్వాలి

కల్లుగీత కార్మిక సంఘం డిమాండ్

సంగారెడ్డి రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత వృత్తిలో ప్రమాదానికి గురైన గీత కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని కల్లుగీత కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. గత ప్రభుత్వం గీత వృత్తిలో చనిపోయిన వారికి కార్పొరేషన్ ద్వారా తక్షణ సహాయం కింద వారి కుటుంబాలకు రూ.25 వేలు, గాయపడిన వారికి రూ.15 వేలు ఆర్థిక సాయం చేసేదని గుర్తు చేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకాన్ని నిలిపివేసిందని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత వృత్తిదారుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గీత కార్మికులు, గౌడ కులస్థుల సత్తా చూపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేజీకేఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్నగౌడ్, ఉపాధ్యక్షుడు అంజన్నగౌడ్, జిల్లా కార్యదర్శి ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నంగునూరులో ఉపాధి పనుల్లో అవకతవకలు

● సామాజిక తనిఖీలో రూ.22వేల రికవరీ.. రూ.63 వేల ఫైన్

నంగునూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరిగాయని నంగునూరులో సోమవారం జరిగినసామాజిక తనిఖీల్లో వెల్లడైంది. ఎంపీడీవో లక్ష్మప్ప అధ్యక్షతన నిర్వహించిన ప్రజావేదికలో డీఆర్డీవో అసిస్టెంట్ పీడీ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ, మస్టర్ నిర్వహణ సరిగా లేదని, ఎంపీడీవో, ఏపీవో సంతకాలు లేకుండానే పలు గ్రామాల్లో పేమెంట్లు జరిగాయని తెలిపారు. తనిఖీల్లో భాగంగా రూ.22వేలను రికవరీ చేయగా, పెద్ద గ్రామాల్లో జరిగిన అవకతవకలపై రూ.63 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ విజిలెన్స్ మేనేజర్ గణేష్, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా నిధులు రూ.5.50 లక్షలకుపైగా స్వాహా

● సిరిసనగండ్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

కొండపాక, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం సిరిసనగండ్ల గ్రామంలో డ్వాక్రా మహిళలకు చెందిన నిధులను గ్రామ వీవోఏ స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత మూడు సంవత్సరాల క్రితం 12 డ్వాక్రా గ్రూపుల సభ్యులు తీసుకున్న అప్పునకు సంబంధించిన డబ్బులు చెల్లించకపోవడంతో సోమవారం ఏపీఎం మగ్దూమ్ ఆలీ గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. రుణాలు ఎందుకు చెల్లించడం లేదని ఏపీఎం ప్రశ్నించగా, తాము ఎలాంటి రుణాలు పొందలేదని, ఈ విషయం తమకు తెలియదని మహిళలు బదులిచ్చారు. తమ పేరుపై రుణాలు వేరేవారు ఎలా తీసుకుంటారని ఏపీఎంను నిలదీశారు. రుణాల విషయంలో విచారణ చేయగా, వీవోఏ శంకర్ సుమారు రూ.5.50 లక్షలు మహిళా సంఘాలకు తెలియకుండా తీసుకున్నట్లు తేలింది. ఈ డబ్బులను త్వరలో చెల్లిస్తానని వీవోఏ అంగీకరించినట్లు ఏపీఎం తెలిపారు.

దళిత ఉద్యమ నేత కృష్ణంరాజు కన్నుమూత



నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు(ఫైల్)

పుల్‌కల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా సీనియర్ దళిత ఉద్యమ నేత, బడుగు, బలహీన వర్గాల నాయకుడు నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. చౌటకూర్ మండలం హన్మాపూర్ గ్రామానికి చెందిన కృష్ణంరాజు, మూడు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో అనేక దళిత ఉద్యమాలకు నాయకత్వం వహించారు. సింగూరు ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు అండగా నిలిచి, వారికి న్యాయం జరిగేలా కృషి చేశారు. సోమవారం హన్మాపూర్‌లో జరిగిన అంత్యక్రియలకు కార్మిక నేత ఎస్ఎస్ఎల్ వెంకట్‌రెడ్డి, తెల్లాపురం బాలయ్య, దళిత సంఘాల నాయకులు పల్లె సంజీవయ్య, ఏర్పుల కృష్ణ, రుద్రారం నర్సింహా తదితరులు హాజరై నివాళులర్పించారు.

డెంగ్యూ డేంజర్

- వర్షాకాలంలో విజృంభణకు అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
- పరిసరాల పరిశుభ్రతతోనే చెక్
- లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించాలి





సంగారెడ్డి/రామచంద్రాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమల బెడద పెరిగింది. ఇలాంటి చోట డెంగ్యూ వ్యాప్తికి అనుకూలంగా ఉంటుంది. కొన్ని వారాలుగా ఉమ్మడి జిల్లాలో జ్వరాల కేసులు పెరుగుతున్నాయి. ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతోంది. ఈ జ్వరాలు డెంగ్యూ కావచ్చు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎలా వస్తుంది? లక్షణాలు ఏమిటి?

డెంగ్యూ అనేది 'ఏడిస్ ఈజిప్టి' అనే ఆడ దోమ కాటు ద్వారా వ్యాపించే వైరల్ వ్యాధి. ఈ దోమ పగటిపూట కుడుతుంది. డెంగ్యూ సోకిన వారికి సాధారణంగా 2 నుండి 7 రోజుల పాటు జ్వరం ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు తీవ్రంగా ఉంటాయి. జ్వరంతో పాటు తలనొప్పి, కళ్ల నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మంపై దద్దుర్లు, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం అత్యవసరం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

డెంగ్యూ నివారణకు వ్యక్తిగత, సామూహిక కృషి అవసరం. ముఖ్యంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసరాల్లో, కూలర్లు, కుండీల్లో, టైర్లలో, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమలు గుడ్లు పెట్టడానికి ఇవి అనుకూలం.
- ఇల్లు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మురుగునీటి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలి.
- దోమతెరలు, రక్షణ: రాత్రిపూట దోమతెరలు వాడటం, దోమల నివారణ క్రీములు లేదా స్ప్రేలు ఉపయోగించడం మంచిది.
- పొడవాటి చేతులున్న దుస్తులు ధరించడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చు.
- పౌష్టికాహారం తీసుకోవడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి.

ప్రాణాపాయ పరిస్థితులు

డెంగ్యూ జ్వరం సాధారణంగా తేలికపాటి లక్షణాలతో ప్రారంభమైనప్పటికీ, కొందరిలో ఇది తీవ్ర రూపం దాల్చి ప్రాణాంతకంగా మారవచ్చు. డెంగ్యూ వైరస్ శరీరంలోని రక్త నాళాలను దెబ్బతీసి, ప్లేట్‌లెట్ల సంఖ్యను విపరీతంగా తగ్గిస్తుంది. ప్లేట్‌లెట్లు రక్తం గడ్డకట్టడంలో కీలకపాత్ర పోషిస్తాయి. వాటి సంఖ్య తగ్గడం వల్ల శరీరంలో అంతర్గత రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. ఇది జీర్ణవ్యవస్థలో, చర్మం కింద, లేదా ఇతర అవయవాలలో రక్తస్రావానికి దారితీస్తుంది. జ్వరం తగ్గిన తర్వాత 24-48 గంటలు అత్యంత కీలకమైన సమయం. ఈ సమయంలో కొన్ని లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రిలో చేరాలి. కడుపులో విపరీతమైన నొప్పి, తరచుగా వాంతులు కావడం, శ్వాసలో ఇబ్బంది లేదా వేగంగా తీసుకోవడం, చిగుళ్ల లేదా ముక్కు నుంచి రక్తం కారడం, తీవ్రమైన అలసట, నీరసంగా అనిపించడం, చర్మంపై ఎరుపు మచ్చలు వంటి దద్దుర్లు రావడం, నల్లటి మలం లేదా వాంతులలో రక్తం కనిపించడం, చల్లగా, చెమటలు పట్టి బీపీ పడిపోవడం.. ఈ లక్షణాలు డెంగ్యూ షాక్ సిండ్రోమ్ (డీఎస్ఎస్) లేదా డెంగ్యూ హెమరేజిక్ ఫీవర్ (డీహెచ్ఎఫ్)కు సంకేతాలు కావచ్చు. ఈ దశలో తక్షణ వైద్య సహాయం అందకపోతే, అవయవ వైఫల్యం సంభవించి మరణానికి దారితీయవచ్చు.

రెండు రోజుల్లో జ్వరం తగ్గకపోతే వైద్యులను సంప్రదించాలి



రెండు రోజుల వరకు జ్వరం తగ్గకపోతే విధిగా వైద్యుడిని సంప్రదించాలి. లక్షకు తక్కువగా ప్లేట్‌లెట్ కౌంట్ ఉంటే అప్రమత్తం కావాలి. డెంగ్యూ వ్యాధి అని నిర్ధారణ అయితే వెంటనే ఆసుపత్రిలో చేర్పించి తగు చికిత్స అందించాలి. డెంగ్యూ వంటి తీవ్ర జ్వరాల సమయంలో స్వయం వైద్యం పాటింపుతో ఎలాంటి ప్రయోజనం ఉండదు. పైగా ప్రమాదకరం కూడా. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడి సలహా తీసుకోవాలి.

- డాక్టర్ సోమ్‌నాథ్‌గుప్తా, ప్రముఖ వైద్యులు

దరఖాస్తులు

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

సిద్దిపేట కల్చరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో విద్యార్థి వివరాలు నమోదు చేసుకుని, టీఎస్‌ఆన్‌లైన్, మీసేవా ద్వారా ఫీజు చెల్లించాలని చెప్పారు. అనంతరం ఫీజు రసీదు, అడ్మిషన్‌ఫామ్, విద్యార్థి ధ్రువపత్రాలు సంబంధిత అధ్యయన కేంద్రంలో సమర్పించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత ఫీజు కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'నవోదయ' దరఖాస్తుకు 29 వరకు అవకాశం

జవహర్ నవోదయ విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశ పరీక్షకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, విద్యార్థి తల్లిదండ్రులు ఉమ్మడి జిల్లాలోనే నివాసం ఉండాలని పేర్కొన్నారు. 2014 మే 1 నుంచి 2016 జూలై 31 మధ్యలో జన్మించి ఉండాలని చెప్పారు. ఈనెల 29 వరకు ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్లయ్ చేసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతకం చేసిన ధ్రువపత్రం, ఫొటో జతచేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ ఎంపిక పరీక్ష డిసెంబర్ 13న నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల దరఖాస్తుకు గడువు పెంపు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి జూలై 17 వరకు గడువు పొడిగించారని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 2025 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ జిల్లా, మండల పరిషత్, టీజీఎంఎస్, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తుందన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు 17లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, దరఖాస్తు చేసిన అప్లికేషన్, ధ్రువపత్రాలను 19లోగా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- అన్ని పరిశ్రమలలో రక్షణ పరికరాలు తప్పనిసరి
- నిబంధనలు పాటించని పరిశ్రమలపై చర్యలు
- రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

పటాన్‌చెరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాల పట్ల పారిశ్రామికవేత్తలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి పరిశ్రమలోనూ అగ్ని ప్రమాదాల నివారణకు రక్షణ పరికరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పాశమైలారం ఐలా ప్రాంగణంలో పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్ని పరిశ్రమలలో కార్మికులకు అగ్ని ప్రమాదాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని డీజీ కోరారు. చాలా పరిశ్రమల్లో అగ్నిప్రమాద నియంత్రణ చర్యలు లేవని, విలువైన రసాయనాలను ఉపయోగించే పరిశ్రమల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆయన అన్నారు. అటువంటి పరిశ్రమలలో నిపుణులైన కార్మికులను నియమించడం ద్వారా అగ్ని ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని సూచించారు. రాష్ట్రంలో జరిగిన ప్రమాదాల్లో అగ్నిమాపక శాఖ సమర్థవంతంగా పనిచేసి ఆస్తి నష్టం, ప్రాణనష్టం తగ్గించడంలో కృషి చేయడం అభినందనీయమన్నారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం నేపథ్యంలో పారిశ్రామికవేత్తలు అలర్ట్‌గా ఉండాలని తెలిపారు. అగ్ని ప్రమాదాల విషయంలో నిబంధనలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా డీజీ నాగిరెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పారిశ్రామికవేత్తలతో పాటు జిల్లా ఫైర్ అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

- పార్టీలో కష్టపడిన వారికే పదవులు
- నామినేటెడ్ పోస్టుల భర్తీ త్వరితగతిన పూర్తి చేయాలి
- పీసీసీ మెదక్ జిల్లా ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, గ్రామగ్రామాన విజయం సాధించేలా నేతలు కృషి చేయాలని పీసీసీ మెదక్ జిల్లా ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై గాంధీ భవన్‌లో సోమవారం ఆయన కీలక సమావేశం నిర్వహించారు. పార్టీలో కష్టపడిన వారికే పదవులు వస్తాయని తెలిపారు. ముందు నుంచి పార్టీలో యాక్టివ్‌గా ఉన్న వారికి మండల అధ్యక్షుల రేసులో అవకాశాలు వస్తాయని తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రభుత్వం చారిత్రాత్మకంగా తీసుకున్న నిర్ణయం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పిందని దీని ద్వారా కొత్త నాయకత్వానికి కూడా అవకాశాలు వస్తాయని వెల్లడించారు. ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధితో రాష్ట్రం ముందుకు పోతుందన్నారు. సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. కిందిస్థాయిలో నేతలు, ప్రభుత్వం, పార్టీ సమన్వయం చేసుకొని పని చేస్తేనే పార్టీ బలోపేతం అవుతుందని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మూడు జిల్లాల డీసీసీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, ఆంజనేయులుగౌడ్, పార్లమెంట్ ఇన్‌చార్జి ఉపాధ్యక్షులు బండి రమేష్, నవాబ్ ముజాహిద్ ఆలంఖాన్, జనరల్ సెక్రెటరీలు జగదీశ్వర్ గౌడ్, ధరా సింగ్, ఉప్పల్ శ్రీనివాస్ గుప్త, నందిమల్ల యాదయ్య, చనగాని దయాకర్, అసదుద్దీన్, అబ్బర్వర్లు మెట్టు సాయి కుమార్, పవన్ మల్లాది, పార్లమెంట్ ఇన్‌చార్జిలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, జనరల్ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేసిన వారందరికీ అవకాశాలు

ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశాలతో సంస్థాగత నిర్మాణంపై తుది కసరత్తు నిర్వహించారు. అందులో భాగంగా గ్రామ శాఖ అధ్యక్షుల నుంచి వార్డు, బ్లాక్ అధ్యక్షులు, మండల శాఖ అధ్యక్షులు, జిల్లా కార్యవర్గం, అనుబంధ సంఘాల నియామకం పూర్తి చేసేలా ముఖ్య నేతలతో చర్చించారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఇచ్చిన షార్ట్ లిస్ట్‌పై కసరత్తు పూర్తి చేసి పీసీసీ, ఏఐసీసీ ఇన్‌చార్జిలకు పంపిస్తామన్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నామినేటెడ్ పోస్టులు త్వరలోనే పూర్తి అయ్యేలా కసరత్తు జరుగుతుందని పార్టీ కోసం పని చేసిన వారందరికీ అవకాశాలు వస్తాయని వెల్లడించారు. నామినేటెడ్ పోస్టుల్లో భాగంగా చాలా మండలాల్లో మార్కెట్ కమిటీలు, పట్టణ అభివృద్ధి కమిటీలు, ఆలయ కమిటీలు, తదితర పెండింగ్‌లో ఉన్న పోస్టులను నెలాఖరులోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

పదవులకు బ్రేక్

(5వ పేజీ తరువాయి) ప్రతికూల ఫలితాలు వచ్చినావస్తాయని గ్రహించారు. అందుకే ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాతనే పార్టీ పదవుల పంపకాన్ని తెరమీదకు తేవడానికి నిర్ణయించారు.

నామినేటెడ్ పోస్టులు తేలేనా?

ఈ నెలాఖరు వరకు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని ఏఐసీసీ నుంచి ఆదేశాలు రావడంతో ఆ దిశగా టీపీసీసీ సూచనలు చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాలు ఉండగా సిద్దిపేట నియోజకవర్గం మినహా మిగితా అన్నిచోట్ల నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. సిద్దిపేటలో పలు గ్రూపులు ఉండడంతో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికివారే యమునాతీరే అన్నట్లుగా తయారైంది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ కోసం 16 మంది దరఖాస్తు చేశారంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. 20 నెలలు గడుస్తున్నా గ్రూపు రాజకీయం ఇనుమంతైనా తగ్గలేదు. స్థానిక నేతలతోపాటు మంత్రులు, ముఖ్యనేతలకూ ఇక్కడ వర్గాలు ఉన్నాయి. అందుకే సిద్దిపేట నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులకు ఒక్క నామినేటెడ్ పోస్టు కూడా దక్కలేదు. సుడా చైర్మన్ పదవి సహా వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఆత్మ కమిటీలు, దేవాదాయ కమిటీలూ పెండింగ్‌లో పడ్డాయి. ఒక్కో కమిటీకి నాలుగైదు జాబితాలను ఎవరికి వారు తయారుచేసి పంపించారు. ఈనెల 30వ తేదీ వరకు నామినేటెడ్ పోస్టుల ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉండడంతో ఇప్పుడైనా సిద్దిపేట నేతలకు నామినేటెడ్ కోటాలో అవకాశం వస్తుందేమోనని ఎదురుచూస్తున్నారు.

దిశానిర్దేశం చేసిన పొన్నం ప్రభాకర్

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జులు, ముఖ్యనాయకులు, అధ్యక్ష పదవులు ఆశించేవారంతా సోమవారం గాంధీభవన్‌కు తరలివచ్చారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర టీపీసీసీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. నియోజకవర్గం వారీగా సమీక్ష చేపట్టారు. పరిచయ కార్యక్రమాలతోపాటు వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. కష్టపడ్డవారికి మంచి అవకాశాలు కల్పిస్తామని చెప్పుకొచ్చారు. స్థానిక, పంచాయతీ ఎన్నికల్లో నూరు శాతం సీట్లు లక్ష్యంగా శ్రమించాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే పార్టీ పదవులతోపాటు మిగిలిపోయిన నామినేటెడ్ పోస్టులు కూడా భర్తీ చేస్తామని సూచించారు. త్వరలోనే ఆయా నియోజకవర్గాలకు స్వయంగా వచ్చి అందరితోనూ సమావేశమవుతామని స్పష్టం చేశారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు, బాలింతల వద్దకే వైద్య సేవలు

ఇంటింటికీ వెళ్లి వైద్యమందిస్తున్న మర్కూక్ మండల వైద్యాధికారిణి



బాలింత యోగక్షేమాలను తెలుసుకుంటున్న మండల వైద్యాధికారిణి డాక్టర్ దీప

మర్కూక్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మర్కూక్ మండల వైద్యాధికారిణి డాక్టర్ దీప వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, బాలింతల కోసం ప్రతీ రోజు మండలంలోని ఒక గ్రామానికి వెళ్లి, స్వయంగా వారి ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందించి, అవసరమైన సూచనలు చేస్తున్నారు. సోమవారం మండల పరిధిలోని చేబర్తి గ్రామంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారి బొమ్మని శ్రీలక్ష్మి, బాలకృష్ణ కూతురు కోసం ఆమె స్వయంగా ఇంటికి వెళ్లి, తల్లిబిడ్డల యోగక్షేమాలను తెలుసుకొని సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం, అంగన్‌వాడీ టీచర్లు రాణి, స్వప్నలతతో కలిసి కాలనీలను సందర్శించారు. సాధారణంగా ఉండే బీపీ, షుగర్, దగ్గుతో బాధపడుతున్న వారి నుంచి 30 శాంపిల్స్ సేకరించారు. 10 మందికి ఎక్స్‌రే తీయించి, ఆశా కార్యకర్తలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, భువనేశ్వర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి. లత తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని మునీశ్వరునికి ప్రత్యేక పూజలు

కోహీర్‌లోని రైతులు, ప్రజల పాదయాత్ర

కోహీర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం ఆషాఢమాసంలో కోహీర్ ప్రాంత ప్రజలు బిలాల్‌పూర్ గ్రామంలోని నారింజ వాగు జన్మస్థలమైన మునీశ్వరుని ఆలయం వద్ద పూజలు చేయడం ఆనవాయితీగా వస్తున్నది. కోహీర్ మండల కేంద్రానికి చెందిన పలువురు రైతులు, ప్రజలు సోమవారం మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో గల మునీశ్వరుని ఆలయానికి పాదయాత్రగా బాజాభజంత్రీలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో ప్రజలు, రైతులు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,ఔరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీ పై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలం పాటను మేము దిగువ తెలిపిన తేదిన వేలం చేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యలు ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదిని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం తేది: 25-07-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం. 2-9&2-10, 1వ అంతస్తు,ప్రధాన రహదారి,బస్టాండ్ ఎదురుగా,నర్సాపూర్,మెదక్ జిల్లా,తెలంగాణ-502313

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
NRSMKPJ2501060002	BOTLA NIRMALA	NRSMKPJ2501080006	DONTHULA SWAMI

వేలం తేది: 25-07-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం. 4-6-88, 1వ అంతస్తు,సింగరపు రాంచేంద్రయ్య కాంప్లెక్స్,స్టేషన్‌రోడ్,వికారాబాద్,తెలంగాణ-501101

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
VIKRBPJ2501200004	HARIKRISHNA GOUD DOMA		

వేలం తేది: 25-07-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఇంటి నం. 2-2-245 ,1వ అంతస్తు,శాంతినగర్ కాలనీ,తాండూరు,రంగారెడ్డి,తెలంగాణ-501141

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
TNDURPJ2501170003	RAJU KURVA		

వేలం తేది: 25-07-2025 వేలం చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్,ఇంటి నం. 3-5-53/1,1వ అంతస్తు,కొత్తబస్టాండ్ ఎదురుగా,వీరభద్రనగర్,సంగారెడ్డి ,తెలంగాణ-502001

Loan A/c No.	Customer Name	Loan A/c No.	Customer Name
JGPETPJ2501060008	MALLESHAM YELAKURTHI	SNGRYPJ2501270003	APARNA ERUKALA
JGPETPJ2501090008	RAJASHEKAR GATTUMEEDI	SNGRYPJ2501310001	KAMMARI MALLIKARJUN
JGPETPJ2410260001	LAXMAIAH BOLLARAM	SNGRYPJ2411010001	MAHINDER KUMAR MUTHUJAPUR

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు **శ్రీ మల్లికార్జునరెడ్డి ను** సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును.కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 15.07.2025
స్థలం: హైదరాబాద్

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

మూడేళ్ల ఎదురుచూపులకు తెర

● ఎట్టకేలకు మహంకాళీ ఆలయ ధర్మకర్తల నియామకం

రామాయంపేట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు రామాయంపేట మహంకాళీ ఆలయ ధర్మకర్తల నియామకం జరిగింది. దీంతో మూడేళ్ల ఎదురుచూపులకు తెరపడింది. గత ప్రభుత్వంలోనే పాలకవర్గం గడువు ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 20 నెలలు కావస్తున్న నేపథ్యంలో నూతన ధర్మకర్తలను రాష్ట్ర దేవాదాయశాఖ సోమవారం విడుదల చేసింది. సభ్యులుగా దోమకొండ యాదగిరి, సామల రవి, రమావత్ మంజుల, మంగలి సత్తయ్య, బీర రామచంద్రం, గూడాల లింగం, భూమ కిషన్, దారం సంతోష్, అనిత, బైరం స్వప్న, పిట్ల ప్రకాష్, మర్కు గంగారాం ఉన్నారు. పాలకవర్గం నియామకానికి కృషిచేసిన మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనరసింహ, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావుకు టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు కృతజ్ఞతలు తెలిపారు.



మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

నారాయణఖేడ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా ముందుసాగుతుందని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి విజయోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు రూ.2,87,82,000 కోట్ల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గిరిజా షెట్కార్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్ పాల్గొన్నారు. నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్ అటవీ ప్రాంతాన్ని రూ.3.86 కోట్లతో అర్బన్ పార్కుగా ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం వన మహోత్సవంలో భాగంగా వెంకటాపూర్ క్రాస్‌రోడ్ వద్ద ఉన్న అటవీ శాఖ ప్రాంతంలో మొక్కలు నాటారు. కాగా మండల పరిధిలోని అంత్వార్‌లో ఇందిరమ్మ గృహాల, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. అలాగే ఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన చిరు వ్యాపారుల దుకాణ స్టాళ్లను పరిశీలించి వారితో మాట్లాడి ఉపాధి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.


మహిళా సంఘాల సభ్యులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజల ఉండాలి : ఎమ్మెల్యే


బోనాలలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కొండాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్కాపూర్ శేషాద్రినగర్ అషాఢమాసం బోనాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున బోనాలతో ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవానికి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరై అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొని మాట్లాడారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరినట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట మాజీ సీడీసీ చైర్మన్ మాణిక్యం, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనపురం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయండి

● లేదంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తాం
● కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఘనపురం ఆయకట్టు కింద సాగుచేస్తున్న పంట పొలాలను రక్షించడానికి సింగూరు నుంచి నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాహుల్ రాజ్‌కు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి వినతిపత్రం అందజేసి, వారు మాట్లాడారు. సింగూరులో 0.4 టీఎంసీల నీటి వాటా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, రైతులు కన్నీళ్లు పెట్టుకున్నా పట్టించుకునే వారు లేరని మండిపడ్డారు. సింగూరు, కాళేశ్వరం జలాలు కొండ పోచమ్మసాగర్ నుంచి హల్దీ ప్రాజెక్టుకు సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నర్సాపూర్ నియోజకవర్గం, దుబ్బాక, నార్సింగి, చేగుంట, గజ్వేల్, తూప్రాన్ మండలాల్లో అధికార పార్టీ నాయకులు ప్రొటోకాల్ పాటించేలా చూడాలని ఎమ్మెల్యే సునీతా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్లు మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ లావణ్యారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్న నగేష్

చేగుంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తుందని మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. చేగుంట మండలం రెడ్డిపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సోమవారం ఆయన ఎంఈవో రాధాకిషన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు రుచికరమైన భోజనం అందిస్తున్నారని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో నీరజ, పాఠశాల ప్రత్యేకాధికారి శ్రీవాణి ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా సైన్స్ ల్యాబ్‌లు నిర్వహించాలి

● మెదక్ డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను జిల్లాలో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని డీఈవో రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో జిల్లాలోని 40 మంది సైన్స్ ఉపాధ్యాయులకు రెండు రోజులు పాటు జరుగనున్న శిక్షణా తరగతులను సోమవారం డీఈవో ప్రారంభించి మాట్లాడారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు జిల్లావ్యాప్తంగా 30 పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సైన్స్‌ను ప్రయోగశాలకు అనుసంధానం చేస్తూ.. నిత్యజీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను వివరిస్తూ.. ప్రయోగశాలలను నిర్వహించకుండా బోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్, ఏఎంలో సురదర్శనమూర్తి, పాఠశాల ప్రిన్సిపల్ సువర్ణలత, రిసోర్స్ పర్సన్స్ నవీన్, కిరణ్ తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికలకు నాణ్యమైన విద్యనందించాలి

సంగారెడ్డి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో విద్యనభ్యసించే బాలికలకు నాణ్యమైన విద్యనందించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లాలోని వివిధ కేజీబీవీల్లో ఖాళీగా ఏర్పడిన పీజీసీఆర్‌టీ, సీఆర్‌టీ, పీఈటీ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసిన 11 మందికి సోమవారం డీఈవో వెంకటేశ్వర్లు నియామకపత్రాలు అందజేసి మాట్లాడారు. కొత్తగా చేరిన వారు విధుల పట్ల బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో వెంకటేశం, జీసీఈవో సుప్రియ, అధికారులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో ఎరువు తయారీ

ఐడీఏబొల్లారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంతాల్లో విడుదల అవుతున్న వ్యర్థాలను పూర్తి సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియ ప్రారంభించామని రాష్ట్ర పురపాలక శాఖ రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు చెప్పారు. సోమవారం ఐడీఏబొల్లారం పురపాలక పట్టణంలో వందరోజుల ప్రణాళికా కార్యక్రమాన్ని, వైకుంఠధామం, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్‌యార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టుపక్కల అన్ని పురపాలికల్లో బయోమైనింగ్ పద్ధతిలో చెత్తను ఎరువులుగా మారుస్తున్నారని చెప్పారు. ఇప్పటికే తెల్లాపూర్, అమీన్‌పూర్ పురపాలక పట్టణాల్లో అమల్లో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కిషన్, నర్సింహ, మల్లికార్జున్, డీఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

కొల్లూరు డంపింగ్‌యార్డులో బయోమైనింగ్


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

రామచంద్రాపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు డంపింగ్‌యార్డులో సమస్యలు పరిష్కరించడానికి అధికారులు సోమవారం బయోమైనింగ్ పనులు ప్రారంభించారు. కొన్ని నెలలుగా చెత్తను ఒకేచోట కుప్పగా వేయడం వల్ల గ్యాస్ వ్యాప్తి చెంది మంటలు అంటుకున్నాయన్నారు. దీంతో డంపింగ్‌యార్డు పక్కనున్న ప్రజలు తమకు పొగ ద్వారా అనారోగ్యం కలుగుతుందని ఆందోళన వెలిబుచ్చారు. దీనికి పరిష్కారంగా సోమవారం బయోమైనింగ్ (చెత్తను వేరుపర్చడం)ను ప్రారంభించారు. దీనిద్వారా ఏర్పడే ఎరువును మున్సిపాలిటీ విక్రయిస్తుందని కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ సత్యనారాయణ, మేనేజర్ అఖిల్, ఏఈ మౌనిక పాల్గొన్నారు.

4 దరఖాస్తులకు.. 14 శాఖల అధికారులు


ప్రజావాణిలో వివిధ శాఖల అధికారులు

కొండాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సోమవారం మండల కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని కరోనా కారణంగా నిలిపేసిన విషయం తెలిసిందే. అయితే 5 ఏళ్ల తర్వాత సోమవారం కొండాపూర్ రెవెన్యూ కార్యాలయంలో ప్రజావాణిని తహసీల్దార్ అశోక్ వివిధ మండల శాఖల అధికారులతో నిర్వహించారు. దాదాపు 14 శాఖల అధికారులు ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు కార్యాలయంలో ఉన్నారు. కాగా ఆదాయం సర్టిఫికెట్, పౌతి మార్పు, మిస్సింగ్ ల్యాండ్, పంటలకు సాగునీరు అందించాలని నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అధికారులు గంటల తరబడి వేచి చూసినా అర్జీదారుల రాక కనిపించలేదు.

ఇద్దరు విద్యార్థులకు.. ఇద్దరు ఉపాధ్యాయులు..!


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంఈవో మన్మథకిషోర్

నాగల్‌గిద్ద, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌడ్‌గాం జన్‌వాడలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులతో చదువులు కొనసాగుతున్నాయి.నాగల్‌గిద్ద ఎంఈవో మన్మథకిషోర్ సోమవారం పాఠశాలను సందర్శించి, గ్రామస్థులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరేవిధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

18న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

నర్సాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధ్యక్షుడిగా నియామకమైన రామచందర్‌రావు ఈ నెల 18న మెదక్ జిల్లాలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్వగృహంలో మెదక్ జిల్లా ముఖ్య నాయకులు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్‌తో కలిసి మల్లేశ్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. మొదటిసారి జిల్లాకు వస్తున్నందున నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

మనోహరాబాద్/చిన్నశంకరంపేట/శివ్వంపేట/రేగోడు/రామాయంపేట/వెల్దుర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఉమ్మడి మండల అటవీ రేంజ్ అధికారి అంబర్‌సింగ్ అన్నారు. సోమవారం మనోహరాబాద్ మండలం రంగాయపల్లి ఎమ్ఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో మొక్కలు నాటారు. మండల కేంద్రంలో సుమారు 5 వేల మొక్కలు నాటడమే తమ లక్ష్యమన్నారు. ఇందులో ఎంపీడీవో రవీందర్, ఎంపీవో, పరిశ్రమ సిబ్బంది వసంత్, నర్సింహ, బీట్ అఫీసర్ చంద్ర శేఖర్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాతండా వీధులు, పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు గీత, శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు వెంకట్, ప్రభాకర్, మాజీ సర్పంచులు జమ్ము లాల్యానాయక్, మాజీ వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. శివ్వంపేట మండలం పరిధిలోని గొట్టిముక్ల ఉన్నత పాఠశాలలో సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్ ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులు వివిధ రకాల మొక్కలు నాటి, నీళ్లు పోశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం హిందూమతి, బీట్ ఆఫీసర్ శ్రీవల్లి, కార్యదర్శి శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే హరిత మహోత్సవంలో భాగంగా రేగోడు మండలం కొండాపూర్ గ్రామంలోని ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశామని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ దశరత్‌నాయక్ తెలిపారు. రామాయంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి, మంజీరా స్కూల్ ఆవరణలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అంబర్‌సింగ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ లింబాద్రి నేతృత్వంలో మొక్కలు నాటారు. వెల్దుర్తి శ్రీరాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎఫ్ఎస్‌వోలు కిరణ్‌కుమార్, ఖలీమొద్దీన్, ఎస్ఐ రాజు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు భరత్, స్నేహలత, ఏపీవో రాజు, ఆర్ఐ నర్సింగ్ యాదవ్ పాల్గొన్నారు.


రంగాయపల్లి ఎమ్ఎస్ అగర్వాల్ పరిశ్రమలో మొక్కలు నాటుతున్న అటవీ రేంజ్ అధికారి అంబర్‌సింగ్

న్యూస్ బాక్స్

2508 రేషన్‌కార్డులు మంజూరు

నర్సాపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో 2508 కొత్త రేషన్‌కార్డులు మంజూరైనట్లు ఆర్డీవో మహిపాల్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నర్సాపూర్ మండలంలో 354, కౌడిపల్లి మండలంలో 615, కొల్చారంలో 384, శివ్వంపేటలో 428, వెల్దుర్తిలో 385, చిలప్‌చెడ్‌లో 93, మాసాయిపేటలో 249 చొప్పున కొత్త కార్డులు మంజూరైనట్లు చెప్పారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

సంగారెడ్డి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. ప్లేస్‌మెంట్ సెల్, టీఎస్‌కేసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో శ్రీచైతన్య ఇన్స్టిట్యూషన్స్‌కు నిర్వహించిన మేళాకు 40 మంది అభ్యర్థులు హాజరుకాగా 20 మందిని ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల అధికారులు, కళాశాల అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు పొడిగింపు

సంగారెడ్డి అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ ద్వారా అడ్మిషన్ పొందే గడువును ఈ నెల 31వ తేదీవరకు పొడిగించినట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యాసకులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.వెంకటస్వామిని సంప్రదించాలని ఆయన కోరారు.

'ఉచిత సేవలందించాలి'

జిన్నారం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ వైద్య సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్యసేవలందించాలని గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం వావిలాల గ్రామంలో నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు వైద్యులు, సిబ్బంది ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో రైతులకు ప్రయోజనం

కంగ్టి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూములు కలిగిన ప్రతీ రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కంగ్టిలో కొనసాగుతున్న రైతుల వివరాల నమోదును ఆయన పరిశీలించారు.

19న భద్రాచలానికి ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): భక్తుల సౌకర్యార్థం ఈనెల 19న ఖేడ్ నుంచి భద్రాచలానికి ప్రత్యేక సూపర్ డీలక్స్ బస్సును నడపనున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్ సేల్ ఇన్‌చార్జి పాండు తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ 19న ఉదయం 7 గంటలకు ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరి గణేష్ గడ్డలోని గణేష్ మందిరం, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయాల దర్శనం అనంతరం అదేరోజు రాత్రి భద్రాచలానికి బస్సు చేరుకుంటుందన్నారు. ఈనెల 20న భద్రాచలం శ్రీరాముల వారి దర్శనం, విజయవాడకు వెళ్లి అక్కడి కనక దుర్గమ్మ తల్లి దర్శనం అనంతరం సాయంత్రానికి ఖేడ్‌కు చేరుకుంటుందని వివరించారు. ఒక్కొక్కరికి రూ.2500 చార్జీ ఉంటుందన్నారు. పూర్తి వివరాలు, టికెట్ల బుకింగ్ కోసం 9441071134, 9959223170, 9063417279, 9676667703, నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్హేర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధి బాచేపల్లిలోని గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలలో రెండు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు ఈ నెల 21 లోపు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ నాగార్జునరావ్, హెచ్ఎం కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక వంట మనిషి, ఒక ఆయా పోస్టులకు పదో తరగతి పాసైన మహిళలు 16 నుంచి 21వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేతనం నెలకు రూ.9,750 చెల్లించబడుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 7981090652 నంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

మాజీ సర్పంచ్ మృతి

హవేళిఘణపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ నాయకుడు, ముత్తాయిపల్లి మాజీ సర్పంచ్ అయ్యవారి వెంకటేశ్వర్లు మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సోమవారం మృతుడి గ్రామానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆమె వెంట నాయకులు శ్రీనివాస్ రెడ్డి, గోపాల్‌గౌడ్, కిష్టయ్య, సిద్దిరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

పాత పుస్తకాలే దిక్కు

(5వ పేజీ తరువాయి)

ఎదురవుతున్నాయి. ఇద్దరు కలిసి చదువుకోవాల్సి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి పాఠ్యపుస్తకాలు అందించాలని విద్యార్థినులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలోనే పంపిణీ

జిల్లాలోని కస్తూర్బాల్లో చదివే ఇంటర్ విద్యార్థినులకు త్వరలోనే పుస్తకాలు అందజేస్తాం. ప్రభుత్వం నుంచి ఇంకా రాలేదు. విద్యార్థినులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. వారం ౹ లోగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. రాగాను అందిస్తాం.

\- రాధాకిషన్, మెదక్ డీఈవో

సర్టిఫికెట్‌కో రేటు!

(5వ పేజీ తరువాయి)

తేలింది. దీంతో, మూడు కేంద్రాలపై కొరడా ఝుళిపించారు.

నకిలీ సర్టిఫికెట్లు కనిపెట్టండిలా?

మీ సేవా కేంద్రాల ద్వారా పొందిన ధృవపత్రాలు నకిలీవా? అసలైయేనా? అనే విషయాన్ని ఇట్టే కనిపెట్టేయొచ్చు. మీ సేవా అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ పేజీలో కనిపించే ముఖ చిత్రంపై మీ సేవా ద్వారా పొందిన ధృవపత్రం దరఖాస్తు నంబరు నమోదు చేయాలి. ఫారంలోని వివరాలు నమోదు చేస్తే సర్టిఫికెట్ అసలైందా? లేదా? అన్న విషయం తెలిసిపోతుంది. లేదా స్మార్ట్ ఫోన్‌లో బార్ కోడ్ యాప్ ద్వారా ఒరిజినల్ సర్టిఫికెట్‌పై ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేస్తే సర్టిఫికెట్‌లోని వివరాలు కనిపిస్తాయి. ఈ విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించడంలో కూడా ఇటు అధికారులు, అటు మీ సేవా కేంద్రాల నిర్వాహకులు విఫలమవుతున్నారు.

'శ్యామానాయక్‌తండాకు రోడ్డు సదుపాయం కల్పించాలి'

నారాయణఖేడ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): హంగిర్గాకె పరిధిలోని శ్యామానాయక్‌తండాకు రోడ్డు సదుపాయం కల్పించాలని మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ డిమాండ్ చేశారు. హంగిర్గాకె - శ్యామానాయక్‌తండాల మధ్య ఉన్న రోడ్డు స్థలం తమదంటూ హంగర్గకెకు చెందిన కొందరు వారం క్రితం రోడ్డును తవ్వేశారు. ఓ స్థిరాస్తి సంస్థకు విక్రయించగా తాజాగా సంస్థ వారు స్తంభాలను పాతి ఫెన్సింగ్ వేశారు. దీంతో రోడ్డు లేక తండావాసులు పక్కనున్న గుట్ట పైనుంచి రాకపోకలు సాగిస్తున్నారు. విషయాన్ని తెలుసుకొని రవీందర్‌నాయక్ సోమవారం తండాను సందర్శించి తండా వారితో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో తండాకు రోడ్డు కోసం రూ.1.04 కోట్లు మంజూరు కాగా, అంతలోనే ఎన్నికలు రావడంతో పనులు జరుగలేదన్నారు. ప్రభుత్వం స్పందించి తండాకు రోడ్డు సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఓడీఎఫ్‌లో ఘనంగా బోనాలు

సంగారెడ్డి అర్బన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కంది మండలం పరిధిలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఆషాఢమాస బోనాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓడీఎఫ్ మెదక్ సీజీఎం ఎస్ఎస్.ప్రసాద్, జీఎంలు రత్నప్రసాద్, బాబు, ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్యదర్శి జి.యాదగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మార్కండేయ మందిరంలో ప్రత్యేక పుష్పార్చన

నారాయణఖేడ్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణ శివారులోని భక్త మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం చంద్ర మౌళీశ్వరుడికి ప్రత్యేక పుష్పార్చన, పుష్పాభిషేకం, మహాహారతి, గీతా పారాయణం, హనుమాన్ చాలీసా, లలితాసహస్రనామావళి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని సత్యగామ గ్రామానికి చెందిన పద్మశాలి కులస్తుల ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు.

గోల్డెన్ పార్కు కాలనీలో కనీస వసతులు కల్పించాలి

తూప్రాన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలోని అరితాస్ గోల్డెన్ పార్కు కాలనీలో కనీస వసతులు కల్పించాలని కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు మురళీగౌడ్, రమేష్‌చారి పేర్కొన్నారు. సోమవారం మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్నట్లు వివరించారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాములు, విష పురుగులకు స్థావరంగా తయారైందన్నారు. మిషన్ భగీరథ నీటి వసతి కల్పించాలని, అండర్ డ్రైనేజీ నిర్మాణం చేయాలని, సీసీరోడ్లు వేయాలని కోరారు.

ఆయిల్‌పామ్ పంటలతో అధిక దిగుబడి

మనోహరాబాద్/రేగోడు/తూప్రాన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ పంటలతో అధిక దిగుబడి పొందొచ్చని మండల వ్యవసాయాధికారి(ఏఈవో) నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మనోహరాబాద్ మండలం కోనాయపల్లి పిటిలోని రైతు మన్నె కల్యాణ్ పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. రేగోడు మండలంలోని మర్పల్లి గ్రామ శివారులో సాగుచేసిన ఆయిల్‌పామ్ పంటను మండల వ్యవసాయ అధికారి జావిత్ పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటల సాగు చేపట్టి ఆదాయం పొందొచ్చని మండల వ్యవసాయ అధికారి గంగమల్లు పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లిలో రైతు మేలక మల్లేశ్ భూమిలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ చేపట్టారు.

ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం

మునిపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం మండల పరిధిలోని బుదేరా (ముంబయి జాతీయ రహదారి) చౌరస్తాలో తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల కోసం ఏ రాజకీయ పార్టీ మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, కంకర కరువు

నిజాంపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక, కంకర కరువైందని బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, కంకర ఎంతో అవసరమని, గతంలో టన్నుకు రూ.1000 ఉండగా.. ప్రస్తుతం రెండింతలు, మూడింతలు పెంచుతూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ప్రభుత్వమే ఇళ్లకు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వంద వారాలు అన్నదానం


సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు ఉచితంగా పెడుతున్న భోజనం

సంగారెడ్డి రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రిలో పీఎంకే (పట్నం మాణిక్యం) ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం సోమవారం వందో వారం పూర్తి చేసుకుంది. డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, పట్నం రవితేజలు తమ సొంత నిధులతో పేదల ఆకలిని తీరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.